# ఇక ప్రమాదాల్లేని రోడ్లు



మంగళవారం క్యాంప్ ఆఫీసులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం కెసిఆర్

## కొత్త రహదారి వ్యవస్థకు విజన్ డాక్యుమెంట్

- ఓఆర్ఆర్ అవతల 330 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్
- రెండేళ్లలో పూర్తికి ఎక్కువ ప్యాకేజీలుగా పనుల విభజన
- కేంద్రం నుంచి 2500 కి.మీ జాతీయ రహదారులు రాక
- రోడ్ల సమగ్ర ప్రణాళికపై ఆర్ అండ్ బితో కెసిఆర్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు18:** ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా, అంతర్జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాలతో తెలంగాణలో రహదారుల వ్యవస్థను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో రహదారుల ప్రస్తుత పరిస్థితిని పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, రాబోయే పదేళ్ల కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. క్యాంప్ ఆఫీస్‌లో మంగళవారం ఆర్ అండ్ బి రహదారులు, భవనాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుత రహదారుల ఎలా ఉన్నాయి? ఎలా ఉండాలి? భవిష్యత్తులో మెరుగైన రహదారుల వ్యవస్థ కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలేంటి? జాతీయ రహదారులుగా మార్చాల్సిన రూట్లు ఏవి? కేంద్ర పథకాల ద్వారా నిర్మించాల్సిన రోడ్లు ఎక్కడు న్నాయి? ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా తట్టుకునేలా రహదారులను నిర్మించడం ఎలా? తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేసి, భవిష్యత్తు_కు పనికొచ్చేలా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని సిఎం చెప్పారు. మనిషి ప్రాణాలు అత్యంత విలువైనవి కాబట్టి ప్రమాద రహిత ప్రయాణానికి అనుగుణంగా రహదారుల వ్యవస్థను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. రహదారులనిర్మాణం, నిర్వహణకు సంబంధించి తెలంగాణ రాష్ట్రం అవలంభించే విధానం యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా ఉండాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో రవాణా వ్యవస్థ మెరుగుదల రోడ్ల నాణ్యతపైనే ఆధారపడి ఉందనిఅన్నారు. ఎక్కడ ఎలాంటి రహ దారుల నిర్మాణం అవసరమో గుర్తించి దానికి అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి, మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని, అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూస్తూ అవసరం ప్రాతిపదికనే నిర్మాణాలు చేపడు తున్నా మని సిఎం వెల్లడించారు. కేంద్రం నుంచి కూడా దాదాపు 2500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను మంజూరు చేయించుకోగలిగామని చెప్పారు. జాతీయ రహదారులతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలతో నిర్మించే రహదారులు, రాష్ట్ర పరిధిలోని రహదారులు, అన్నింటిని పరిగణలోకి తీసుకుని దానికి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్ సిద్ధంచేయాలని సూచించారు.

హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్ ≫2

# ప్రమాదాల్లేని రోడ్లు

అవతలి నుంచి 330 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని సిఎం సూచించారు. రెండేళ్లలో ఆర్‌ఆర్‌ఆర్ పనులు పూర్తి కావాలని,దీనికి కావాల్సిన కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. డిపిఆర్‌లు సిద్ధం చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నారని, అవసరమైతే పనిని ఎక్కువ ప్యాకేజీలుగా విభజించి తక్కువ సమయంలో డిపిఆర్‌లు సిద్ధం చేయాలని చెప్పారు. డిపిఆర్‌లు సిద్ధం అయిన వెంటనే భూసేకరణ జరిపి నిర్మాణం ప్రారంభించాలని స్పష్టం చేశారు.

రహదారులు నిర్మించడమే కాకుండా అవి ఎక్కువ కాలం మన్నికగా ఉండేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.వర్షం వస్తే రోడ్లు పాడయ్యే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్లు త్వరగా చెడిపోకుండా ఉండేందుకు ఇతర దేశాల్లో అవలంభిస్తున్న ఆధునిక పద్ధతులను అధ్యయనం చేసి అమలు చేయాలని కోరారు. యూరప్,అమెరికా దేశాల్లో రోడ్లు బాగుంటాయని, అక్కడ రోడ్లు ఎలా వేస్తున్నారో తెలుసుకోవాలని చెప్పారు.రోడ్ల పక్కన పిచ్చి చెట్లు తొలగించాలని, ఎప్పటికప్పుడు సైడ్‌బర్మ్స్ నిర్మించాలని వివరించారు. జాతీయ,రాష్ట్ర రహదారుల వెంట ఎక్కడెక్కడ ఆర్‌ఓబిలు, ఆర్‌యుబిలు, నదులు, కాల్వలపై బ్రిడ్జీలు, కాజ్‌వేలు,రోడ్ అండర్ పాస్ నిర్మించాలో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, దశల వారీగా వాటిని నిర్మించుకునేందుకు విజన్ డాక్యుమెంట్‌లో పొందు పరచాలని ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట అవసరమైన చోట ఐలాండ్‌లు నిర్మించాలని, వాటిని చక్కగా నిర్వహించాలని సిఎం చెప్పారు. రోడ్డు ప్రమాదాల వల్ల నిత్యం అనేక మంది చనిపోవడం కలచివేస్తున్నదని కెసిఆర్ అన్నారు. మలుపులు తగ్గించేందుకు రోడ్డును నేరుగా పునర్నిర్మించాలని సిఎం సూచించారు. జాతీయ, రాష్ట్ర రహదారులు పట్టణాలు, పెద్ద గ్రామాల గుండా వెళ్లకుండా బైపాస్‌లు నిర్మించాలని కెసిఆర్ చెప్పారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. జాతీయ రహదారులుగా బదిలీ అయిన రాష్ట్ర రహదారుల నిర్వహణ పనులు కూడా ఆర్ అండ్ బి శాఖ చేపట్టాలని, జాతీయ రహదారుల నిర్మాణం జరిగే వరకు బాధ్యత తీసుకుని వెంటవెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. సిఎం వద్ద జరిగిన సమావేశంలో డిప్యూటీ సిఎం మహమూద్ అలీ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సి.లక్ష్మారెడ్డి, సిఎంఒ ముఖ్య కార్యదర్శి సి.నర్సింగ్‌రావు, సునిల్‌శర్మ, ఈఎన్‌సీలు రవీందర్‌రావు, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్త
Wed, 19 October 2016
epaper.vaartha.com//c/14061256